## డీఈవోకు చికెన్ భోజనం

**పాఠశాలనును తనిఖీ చేయడానికి వచ్చిన విద్యాధికారికి రాచమర్యాదలు**

బజార్‌హత్నూర్, జూన్ 19 : ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలోని ఆదర్శ పాఠశాలను గురువారం జిల్లా విద్యాధికారి(డీఈవో) శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రేంకుమార్ రాచ మర్యాదలు చేశారు. ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు పప్పు అన్నంతో భోజనం చేస్తే.. డీఈవో, మండల విద్యాధికారి కిషన్‌గుప్తాలకు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ చికెన్‌తో భోజనం పెట్టి రాచ మర్యాదలు చేశాడు. మధ్యాహ్న భోజనం ఎలా ఉంది? పిల్లలకు సక్రమంగా అందిస్తున్నారా? లేదా? అని ఆరా తీయాల్సిన అధికారులు ఇలా ఏమి అడగకుండా చికెన్‌తో భోజనం చేయడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్న భోజన బియ్యంలో పురుగులు వస్తున్నాయని డీఈవోకు భోజన కార్మికులు చెబితే వాళ్ల మాటలు వినకుండా వెళ్లిపోయాడని, ఇది ఎంత వరకు సమంజసమని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.



బజార్‌హత్నూర్ ఆదర్శ పాఠశాలలో చికెన్ వండిన మధ్యాహ్న భోజన కార్మికులు



హాజరు పట్టికను పరిశీలిస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

## ప్రభుత్వ ఉద్యోగి అరెస్టు

- ప్రభుత్వ స్థలాలు ఇప్పిస్తానంటూ ఒక్కొక్కరి వద్ద రూ.1.50 లక్షలు వసూలు
- ఉద్యోగిపై ఏడు కేసులు నమోదు : డీఎస్పీ

ఎదులాపురం, జూన్ 19 : ఓ ప్రభుత్వ ఉద్యోగి ప్రభుత్వ స్థలాలు ఇప్పిస్తానంటూ డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. గురువారం వన్ టౌన్‌లో సీఐ సునీల్‌కుమార్‌తో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించి వివరాలను వెల్లడించారు. ఆదిలాబాద్‌లోని మాసుద్‌నగర్‌కు చెందిన మహ్మద్ తాజొద్దీన్ అలియాస్ షాకీర్ నిర్మల్ జిల్లా ఖానాపూర్ కోర్టులో టైపిస్టుగా పని చేస్తున్నాడు. ఆదిలాబాద్ పట్టణంలోని సర్వే నంబర్ 29/1 ఇందిరమ్మ కాలనీ, ఖానాపూర్ శివారులో ఖాళీ ప్రదేశాలను చూపించి జిరాక్స్ నకిలీ పత్రాలను వారికి అందజేసి మోసం చేసేవాడు. ఇలా పదుల సంఖ్యలో బాధితులు ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.1.50 లక్షలు తీసుకుని వారికి ప్రభుత్వ స్థలాల పేరిట ఖాళీ ప్రదేశాలను చూపించేవాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇతనిపై గతంలో ఏడు కేసులు నమోదయ్యాయి. అలాగే సర్వే నంబర్ 170 ప్రజలకు నకిలీ పత్రాలు చూపించి రిజిస్ట్రేషన్ చేసి ఇస్తానని చెప్పి మోసం చేసిన కేసు నమోదైనట్లు తెలిపారు.

## వర్షాలు సమృద్ధిగా కురవాలని కప్పతల్లి ఆట



కప్పతల్లి ఆటలు ఆడుతూ వరుణ దేవుడు కురుణ చూపాలని పూజలు చేస్తున్న రైతులు

ఎదులాపురం, జూన్ 19 : వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షిస్తూ ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా కప్పతల్లి ఆటలు ఆడుతూ వరుణ దేవుడు కరుణ చూపాలని పూజలు చేస్తు న్నారు. గురువారం పట్టణంలో ఆగ్రో ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కప్పతల్లి ఆట ఆడారు. స్థానిక పంజాబ్ చౌక్ నుంచి డప్పు చప్పుళ్ల మధ్య అశోక్ రోడ్‌లోని పోచ్చమ్మ తల్లి ఆలయం వరకు కార్యక్రమం సాగింది. పోచమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి.. వర్షాలు సమృద్ధిగా కురవాలని అమ్మవారిని ఆరాధించారు. అనంతరం దుకాణాదారులు కప్పు, రోలుకు జలాభిషేకం చేశారు.

బేల, జూన్ 19 : అగ్రికల్చర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రైవేట్ సీడ్ కంపెనీల ఉద్యోగులు కప్ప తల్లి ఆట ఆడారు. మార్కెట్ యార్డ్‌లో ఉన్న వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గణేష్ ఆలయం నుండి రాం మందిర్ వరకు పలు ప్రధాన వీధుల గుండా డప్పుచప్పుళ్ల మధ్య ప్రదర్శనగా తిరిగారు. బిందెలతో నీళ్లు చల్లుతూ వర్షాలు కురవాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బోయర్ దినేశ్, వెంకటేశ్, గుండావార్ అనిల్, ప్రకాశ్ పవార్, ప్రణయ్ తాతవార్ పాల్గొన్నారు.

## సాగు భూములను లాక్కోవద్దు..



కందకాల తవ్వకాన్ని అడ్డుకుంటున్న రైతులు

పెంబి, జూన్ 19 : సాగు భూములను లాక్కొని మా పొట్ట కొట్టవద్దని గుమ్మెనఎంగ్లాపూర్ రైతులు ఆవేదన చెందుతున్నారు. పెంబి మండలంలోని గుమ్మెన ఎంగ్లాపూర్ గ్రామంలో రైతులు సాగు చేసుకుంటున్న భూముల్లో మొక్కలు నాటడానికి గురువారం అటవీ శాఖ అధికారులు కందకాలు తీసే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న రైతులు కందకాలు తవ్వకుండా అడ్డుకున్నారు. అటవీ భూమి అని లాక్కోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మా భూముల్లో మొక్కలు నాటడానికి ప్రయత్నిస్తే ఉరుకునేదిలేదని హెచ్చరించారు.

## ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఖానాపూర్‌లో నిర్మించాలని..



ఖానాపూర్ పట్టణంలోని తెలంగాణ చౌరస్తా వద్ద ధర్నా చేస్తున్న అఖిల పక్షం నాయకులు

ఖానాపూర్, జూన్ 19 : ఖానాపూర్ నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఎమ్మెల్యే చొరవతో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో నిర్మించడంపై అఖిలపక్షం నాయకులు భగ్గుమన్నారు. గురువారం బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పట్టణంలోని తెలంగా ణ చౌరస్తా వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల విద్యార్థుల భవిష్యతును దృష్టిలో ఉంచుకుని ఖానాపూర్ పట్టణ శివారులోని కుమ్రం భీం చౌరస్తా వద్ద ఉన్న 110 ఎకరాల ప్రభుత్వ స్థలంలో నిర్మించాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందకుండా కాంగ్రెస్ నాయకులు దూరం చేస్తున్నారని మండిపడ్డారు. స్థానిక ఎస్ఐ రాహుల్, రెవెన్యూ ఆర్ఐ నగేశ్ అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. రోడ్డుపై బైఠాయించడంతో గంటపాటు రహదారిపై వాహనాలు నిలిచాయి. ఈ కార్యక్రమంలో నాయకులు గౌరికర్ రాజు, ప్రదీప్, శ్రీనివాస్, బుచ్చన్న, మనోజ్, గంగరావు, రాజు, మురలి, రాజన్న పాల్గొన్నారు.

## పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌పై వర్క్‌షాప్



మాట్లాడుతూన్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, జూన్ 19 : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో చేయూత పథకం (సామాజిక భద్రత పింఛన్లు)పై గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా పాల్గొని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్క్‌షాప్‌నకు డైరెక్టర్ గోపాల్‌రావు హాజరై చేయూత పెన్షన్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, మున్సిపల్ సిబ్బందికి వివరించారు. అనంతరం పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ గురించి డీఎల్‌పీవో, పీపీటీ ద్వారా అవగాహన కల్పించారు. ఏపీడీ, ఏబీఎం కో-ఆర్డినేటర్ స్వచ్ఛ సర్వేక్షన్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, డీపీవో రమేశ్ పాల్గొన్నారు.





## కౌలు రైతుకేదీ సాయం

- పంట పెట్టుబడికి అప్పులు
- ఆదిలాబాద్ జిల్లాలో 28,753 మంది కౌలు రైతులు
- 1.50 లక్షల ఎకరాల్లో సాగు

ఆదిలాబాద్, జూన్ 19(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో కౌలు రైతులను ఆదుకుంటామని ప్రకటించినా.. వారి కోసం పథకాలను అమలు చేయడం లేదు. దీంతో కౌలు రైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకున్నది. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలో వ్యవసాయ కూలీలుగా పనిచేసిన వారు ఇతరుల భూములను కౌలుకు తీసుకుని వానకాలం, యాసంగిలలో సాగు చేస్తారు. జిల్లాలో కౌలు ధరలు ఎకరాకు రూ.12 వేల నుంచి రూ.22 వేల వరకు ఉన్నాయి. ఒక్కో రైతు సగటున ఐదెకరాల వరకు భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తారు. వర్షాకాలంలో కౌలు రైతులు ఎక్కువ విస్తీర్ణంలో పంటలు పండిస్తారు. జిల్లాలో సాగునీటి వనరులు తక్కువగా ఉండడంతో వర్షాలపై ఆధారపడి సాగు చేస్తారు. వానకాలంలో పత్తి, సోయా, కంది పంటలను కౌలు రైతులు ఎక్కువగా పండిస్తారు. వానకాలం వ్యవసాయనికి వర్షాలు, వాతావరణ పరిస్థితులు అనుకూలించి, తెగుళ్లు, చీడ పురుగుల సమస్యలను ఎదురిస్తే దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి.

### అన్ని సమస్యలే..

కౌలు రైతులు విత్తనాలు వేసింది మొదలుకుని పంటను విక్రయించేంత వరకు పలు రకాల సమస్యలు ఎదుర్కొవాల్సి వస్తుంది. బ్యాంకులు అప్పులు ఇవ్వకపోవడం ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం వర్తించకపోవడంతో పెట్టుబడి కోసం దళారులను ఆశ్రయిస్తారు. వారి వద్ద నుంచి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడంతో పాటు నగదును తీసుకుంటారు. ఎకరం పత్తి సాగు చేయలంటే కౌలు రైతులకు అన్ని ఖర్చులు కలుపుకుని రూ.50 వేల వరకు పెట్టుబడి అవుతుంది. ప్రకృతి వైపరీత్యాలు ఎదురించి అహర్నిశలు కష్టపడి సాగు చేసిన పంటలను మద్దతు ధరతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే అవకాశం లేదు. ఇందుకోసం అసలు రైతుకు సంబంధించిన పట్టా పాసు పుస్తకాలు, బ్యాంకు పుస్తకాలు కోసం తీసుకోవాల్సి వస్తుంది. కౌలు రైతులకు సాగులో అన్ని పరిస్థితులు అనుకూలించి, మద్దతు ధరతో పంటను విక్రయిస్తే ఉపాధి లభిస్తుంది. ఏ మాత్రం అటూ, ఇటూ అయిన కౌలు రైతుల పరిస్థితి అధ్వానంగా మారుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినా ఆచరణలో మాత్రం రావడం లేదని రైతు సంఘాల నాయకులు అంటున్నారు.

### కాంగ్రెస్ వరంగల్ డిక్లరేషన్ అమలు చేయాలి..



కాంగ్రెస్ ప్రభుత్వం 2023 సెప్టెంబరు 23లో వరంగల్ డిక్లరేషన్‌ను అమలు చేయాలి. కౌలు రైతులకు రుణ అర్హత కార్డు ఇవ్వాలి. 2011 కౌలు చట్టం అమలు చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వాలి. జేఎల్‌జీ గ్రూపులు ఏర్పాటు, పెట్టుబడి కోసం బ్యాంకు రుణాలు ఇవ్వాలి. రైతులు పంటలు నష్టపోతే పరిహారం చెల్లించాలి. కష్టపడి సాగు చేసిన పంటలను ప్రభుత్వం కేంద్రాల్లో విక్రయించడానికి అవకాశం కల్పించాలి.

*-సంగె బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు*

### ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలి..



పెరిగిన పెట్టుబడి కారణంగా కౌలు రైతుల పరిస్థితి అధ్వానంగా మారింది. నేను 20 సంవత్సరాలుగా 9 ఎకరాలను కౌలుకు తీసుకుని సాగు చేస్తూ ఉపాధి పొందుతున్నా. కౌలు, విత్తనాలు, ఎరువులు, కూలీ ధరలు బాగా పెరిగిపోయాయి. ఎకరా పత్తి సాగు చేయాలంటే రూ.50 వేలు అప్పు చేయాల్సి వస్తుంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం లేకపోవడంతో పెట్టుబడి కోసం దళారులను ఆశ్రయిస్తున్నా. ఎక్కువ వడ్డీతోపాటు వారు ఇచ్చిన విత్తనాలు, ఎరువులు తీసుకుంటాం. పరిస్థితులు అనుకూలిస్తే ఉపాధి దొరకుతుంది. లేకపోతే అప్పులు మిగులుతాయి. ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలి. *- అశోక్, రైతు, తలమడుగు*

## రైతు భరోసా ఎన్నికల జిమ్మిక్కు

- ఎన్నికల్లో ఓటమి భయంతోనే అమలు
- ప్రజలు కాంగ్రెస్ మోసాలను నమ్మవద్దు
- మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలు మోసం చేసిందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. గురువారం బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో పార్లమెంటు ఎన్నికల ముందు రైతు బంధు పథకాన్ని అమలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు స్థానిక ఎన్నికల నేపథ్యంలో మరోసారి రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి మాట మార్చారన్నారు. యాసంగిలో కేవలం నాలుగు ఎకరాల వరకు ఉన్న రైతులకు మాత్రమే డబ్బులు అందించారని, అర్హులైన రైతులకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. గురువారం వరకు ఐదెకరాల వరకు రైతు భరోసా డబ్బులు వేసినట్లు ప్రభుత్వం ప్రకటనలు ఇస్తున్నా, చాలా మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ కాలేదన్నారు. మార్కెఫెడ్‌కు జొన్నల విక్రయించినా డబ్బులు రాక పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకుందన్నారు. బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కిసాన్ సమ్మాన్ యోజనలో జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. పథకం ప్రారంభంలో 1,02,567 మంది లబ్ధిదారులు ఉండగా.. ప్రస్తుతం ఆ సంఖ్య 65 వేలకు పడిపోయిందన్నారు. రైతులను మోసం చేయడంలో బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ చైర్మన్లు యాసం నర్సింగరావు, మెట్టు ప్రహ్లాద్, నాయకులు పరమేశ్వర్, అశోక్ స్వామి, శ్రీనివాస్, కుమ్ర రాజు, దయానంద్, తిరుపతి, ప్రశాంత్, నరేశ్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

## ఇందిరమ్మ పథకం వర్తించలేదని ఆందోళన

**పార్డి(బీ) గ్రామ పంచాయతీ ఎదుట బైఠాయించిన గ్రామస్థులు**



పార్డి(బీ) గ్రామపంచాయతీ ఎదుట ఆందోళన చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు రాని గ్రామస్తులు

కుభీర్, జూన్ 19 : ఇందిరమ్మ పథకంలో పేదలకు ఇండ్లు మంజూరు చేయడంలో స్థానిక ఇందిరమ్మ కమిటీ సభ్యులు అవకతవకలకు పాల్పడ్డారని, దీంతో పేదలైన అర్హులకు కాకుండా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, ఇండ్లున్న వారికి ఇళ్లు మంజూరయ్యాయని పేర్కొంటూ గురువారం నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని పార్డి(బీ) గ్రామస్తులు స్థానిక గ్రామ పంచాయతీ ఎదుట ఆందోళనకు దిగారు. పంచాయతీ కార్యదర్శిని గ్రామస్థులు నిలదీయడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న కుభీర్ పోలీసులు అక్కడకు చేరుకుని ప్రజలను సముదాయించారు. అయిన్పటికీ పేద మహిళలు ప్రభుత్వ వైఖరికి నిరసనగా నినాదాలు చేస్తూ ఇండ్లు లేని వారికి కాకుండా ఇండ్లున్న పార్టీ కార్యకర్తలకు, ఆర్థికంగా మంచి స్థితిలో ఉన్న వారికి కేటాయించిన ఇండ్లు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రేపటిలోగా గ్రామసభ ఏర్పాటు చేసి అర్హులను గుర్తించి ఇండ్లను మంజూరు చేయాలని లేని పక్షంలో కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు.



రాజీవ్ యువ వికాసం పథకానికి మీ సేవలో దరఖాస్తు చేసుకుంటున్న యువత(ఫైల్)

## రాజీవ్ యువ వికాసానికి నిరీక్షణ

**విచారణ పేరిట కాంగ్రెస్ సర్కారు కాలయాపన**

- వాయిదా పడ్డ లబ్ధిదారుల ఎంపిక
- నిర్మల్ జిల్లా వ్యాప్తంగా 35,047 దరఖాస్తుదాలు

నిర్మల్, జూన్ 19(నమస్తే తెలంగాణ) : నిరుద్యోగ యువతకు పెట్టుబడి సాయం అందించి, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఉద్దేశించిన రాజీవ్ యువ వికాసం పథకం అమలుకు నోచుకోవడం లేదు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ముగిసినప్పటికీ తుది జాబితా విడుదల చేయలేదు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ సామాజిక వర్గాల నుంచి దరఖాస్తులను ఆహ్వానించారు. దీంతో జిల్లావ్యాప్తంగా 35,047 మంది యువతీ, యువకులు దరఖాస్తు చేసుకున్నారు. అర్హుల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జూన్ 2వ తేదీన రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో లబ్ధిదారులకు సాయం అందించాల్సి ఉండగా, పలు కారణాలను చెబుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పథకం అమలును వాయిదా వేసింది. రాష్ట్ర వ్యాప్తంగా లక్షల సంఖ్యలో దరఖాస్తులు రావడంతో ఆర్థిక సాయం అందించడం సాధ్యం కాదన్న ఆలోచనతోనే ప్రభుత్వం పక్కన బెట్టిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరికే పథకాన్ని వర్తింపజేస్తే మిగతా వారి నుంచి వ్యతిరేకత వస్తుందని, దీంతో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత పార్టీకి దూరమయ్యే అవకాశాలు ఉంటాయన్న ముందుచూపుతోనే ప్రభుత్వ పెద్దలు బ్రేకులు వేసినట్లు చర్చించుకుంటున్నారు. మరోసారి లబ్ధిదారులను విచారణ చేయాల్సి ఉందని దరఖాస్తుదారులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత చర్యల కారణంగా జిల్లాలోని 35,047మంది దరఖాస్తుదారులకు ఎదురు చూపులు తప్పడం లేదు. దరఖాస్తుదారుల్లో 7,346 మంది ఎస్సీలు, 3,627 మంది ఎస్టీలు, 17,566 మంది బీసీలు, 426 మంది ఈబీసీలు, 6,055 మంది ముస్లిం మైనారిటీలు, 27 మంది క్రిస్టియన్లు ఉన్నారు.

### దరఖాస్తుదారుల్లో నిరాశ

యూనిట్ల పంపిణీని వాయిదా వేయడంతో ఆయా కేటగిరీల కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. దరఖాస్తుదారులకు ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీరిలో అర్హులైన వారికి యునిట్ విలువ ప్రకారం ఐదు విడుతల్లో వచ్చే అక్టోబర్ వరకు మంజూరు పత్రాలను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా మొదటి విడుతలో కేటగిరి-1లో రూ.50వేలు, కేటగిరి-2లో రూ.లక్ష వరకు ఎంపికైన లబ్ధిదారులకు జూన్ 2వ తేదీ నుంచి 9వ తేది వరకు మంజూరు పత్రాలను పంపిణీ చేసి, 15వ తేదీ లోపు శిక్షణ ఇవ్వాలని భావించారు. అలాగే ఈ నెలాఖరులోపు రాయితీ విడుదల చేసి గ్రౌండింగ్ పూర్తి చేయాలని ముందుగా ప్రణాళిక రూపొందించారు. కానీ ఈ పంపిణీ ప్రక్రియ పూర్తిగా వాయిదా పడడంతో లబ్ధిదారుల్లో నిరాశ నెలకొన్నది. మళ్లీ ఈ ప్రక్రియ ఎప్పుడు ప్రారంభమవుతుందో అనే విషయంపై అధికారుల నుండి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో దరఖాస్తుదారులు ఆందోళనకు గురవుతున్నారు. రాబోయే రోజుల్లో స్థానిక సంస్థలకు వరుస ఎన్నికలు ఉండనున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ పేరిట ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పథకాన్ని మరో ఏడాది వరకు అమలు చేసే అవకాశాలు లేవంటున్నారు.